సంఘమిత్రలపై పనిభారం తగ్గించాలి

- రాజకీయ వేధింపులు మానుకోవాలి
- కలెక్టరేట్ ఎదుట వీవోఏల ధర్నా

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సంఘమిత్రలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మంగళవారం కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో సంఘమిత్రలు ధర్నా చేయడం జరిగింది. ఈ సందర్భంగా సంఘమిత్రల యూనియన్ గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం మూడు సంవత్సరాల కాలపరిమితి సర్కులర్ తీసుకొచ్చినప్పుడు పోరాటాలు చేసిన సందర్భంగా ప్రస్తుత ముఖ్యమంత్రి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ సర్కులర్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారు అయితే ఇప్పటివరకు ఆ హామీ నెరవేర్చకుండా దానిని అమలు చేయడం దారుణమన్నారు. జాబు వేతనాలు వెంటనే ఇవ్వాలని, వేతనాలు పెంచాలని, సంఘమిత్రలకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ అమలు చేయాలని ఫైవ్ జి సిములు ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ పథకాలు అన్నిటిని ప్రజలకు చేరే విధంగా చైతన్యం కలిగిస్తున్న వారిపై నిర్లక్ష్యం వహించడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా వున్న సమస్యలు పరిష్కారం చేయాలని, అదే విధంగా జిల్లా స్థాయిలో జిల్లా అధికారులు సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.

పీడీ వైఖరి మారాలి..

తమ సమస్యలు చెప్పుకోవడానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన సంఘమిత్రల సమస్యలు వినకుండా డిఆర్‌డిఏ పీడీ శ్రీదేవి నిర్లక్ష్యంగా వెళ్లిపోవడం దారుణమన్నారు. కింది స్థాయి సిబ్బందిపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. సిబ్బంది పట్ల పీడీ వైఖరి మారాలని కోరారు. ఈకార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు జీను రాజశేఖర్, శ్రీధర్ బాబు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వీవోఏలు

పొగబెట్టకుంటే.. పుట్టదా.. కుట్టదా..!

- దోమలకు నిలయాలుగా గ్రామాలు
- మూలకు చేరిన ఫాగింగ్ యంత్రాలు
- జ్వరాల భారిన పడుతున్న ప్రజలు
- నిర్లక్ష్యంగా ఉన్న ప్రభుత్వ అధికారులు



ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన ప్రభుత్వ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తోంది. వర్షాలు విస్తారంగా పడడంతో గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం మరింత అధ్వానంగా తయారైంది. ప్రజలు విషజ్వరాల భారిన పడి ఆసుపత్రుల వైపు పరుగులు తీస్తున్న సంబంధిత అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుండడం బాధాకరం.

ప్రజాశక్తి- పూతలపట్టు: గ్రామాలను విషజ్వరాలు వణికిస్తున్నాయి. జనం జ్వరాలతో మంచాన పడుతున్నారు. దోమల కారణంగా మలేరియా, టైఫాయిడ్, డెంగీ విష జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. క్షేత్రస్థాయిలో దోమలను నివారించే చర్యలు అధికారులు చేపట్టడం లేదు. పూతలపట్టు మండలంలో 25 పంచాయతీలు ఉండగా.. వీటి పరిధిలో 252 గ్రామాలు ఉన్నాయి. ప్రతి పంచాయతీలో రహదారుల పక్కన చెత్తకుప్పలు, మురుగు నిల్వలు, దుకాణాల వద్ద కొబ్బరి బొండాలు, టీ కప్పులు వేయడంతో అన్ని దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. గతంలో దోమల నివారణకు పంచాయతీలకు ఫాగింగ్ యంత్రాలను కొనుగోలు చేయమని అధికారులు చెప్పినా ఇప్పటికీ ఆ పరిస్థితి కనిపించడం లేదు.

మరమ్మతులకు నోచుకోని యంత్రాలు

గత ప్రభుత్వంలో అనేక పంచాయతీలకు ఫాగింగ్ యంత్రాలు సరఫరా చేశారు. కానీ ఇవి నాసిరకం కావడంతో మరమ్మతులకు గురై మూలన చేరాయి. అప్పటి నుంచి అధికారులు వీటి మరమ్మతులు చేపట్టకపోవడంతో నిరుపయోగంగా కార్యాలయాల్లో ఉన్నాయి. మరమ్మతులకు గురైన వాటిని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్న వాటిని పట్టించుకునే వారే కరువయ్యారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు అంతంతమాత్రంగా చేపడుతుండడంతో దోమలు విజృంభిస్తున్నాయి. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో దోమల ఉత్పత్తి మరింత పెరిగి గ్రామీణులు జ్వరాల భారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఫాగింగ్ కార్యక్రమాలు చేపట్టకపోవడంతో దోమల తీవ్రత పెరుగుతోంది.

దోమలపై దండయాత్ర, పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ అంటూ అధికారులు పలు కార్యక్రమాలు చేపట్టినా అవన్నీ నామమాత్రంగానే చేసి చేతులు దులుపుకుంటున్నారు. కార్యక్రమం అయిన తరువాత గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎలా ఉందో పరిశీలిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

వణికిస్తున్న విష జ్వరాలు

పారిశుధ్య సమస్యలు ఒకవైపు.. అధికారుల నిర్లక్ష్యం మరోవైపుతో పూతలపట్టు మండలాన్ని విషజ్వరాలు వణికిస్తున్నాయి. ఇప్పటికే ఇద్దరు ప్రాణాంతకమైన డెంగీ జ్వరంతో ఆసుపత్రి పాలైనట్లు సమాచారం. అనేకమంది మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలతో మంచాన పడుతున్నారు. ఆసుపత్రులు జ్వరపీడితులతో కిటకిటలాడుతున్నాయి. అధికారులు ఇప్పటికైనా తగుచర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



మురుగునీటి కాలువల దుస్థితి

మూలన పడ్డ ఫాగింగ్ యంత్రాలు

ఆక్రమణలను తొలగించండి: కడా పీడీ

ప్రజాశక్తి- శాంతిపురం: మండల కేంద్రమైన శాంతిపురంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను గుర్తించి ఆక్రమణలను తొలగించాలని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మరమ్మత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రభుత్వ భూముల ఆక్రమణ స్థలాలను ఆయన పరిశీలించారు. ప్రధానంగా శాంతిపురం బస్టాండ్ సంబంధించిన ప్రభుత్వ స్థలంలో ఆక్రమణకు గురైన స్థలాలను పాలారు నది ప్రధాన సప్లై ఛానల్ కాలువను, కాలువపై చేపట్టిన నిర్మాణాలను నోటీసులు అందజేసి 30 రోజుల లోపు ఆక్రమణలను తొలగించాలని అధికారులకు సూచించారు. అలాగే పాలారు సమీపంలో ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసుకున్న చికెన్ దుకాణాలను నోటీసులు అందజేసి తొలగించాలన్నారు. తహశీల్దార్ శివయ్య, ఎంపీడీవో కుమార్, సర్పంచ్ ఏ.విజయం పాల్గొన్నారు.

ఆక్రమణలను పరిశీలిస్తున్న కడా పీడీ

గ్రామీణ రోడ్లు బురదమయం

- నిల్వ చేరిన వర్షపు నీళ్లు
- అవస్థలు పడుతున్న ప్రజలు

పెద్ద ఉప్పరపల్లిలో రోడ్డుపై ఏర్పడిన గుంతలలో నిలిచిన వర్షపు నీరు

ప్రజాశక్తి- సోమల: మండలంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మండలంలోని పలు గ్రామీణ రోడ్లు బురదమయంగా మారి రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. గతం నుంచి తారురోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకున్నదే లేదు.. మట్టి రోడ్డును అలానే వదిలేడంతో రోడ్డు మొత్తం వర్షాల కారణంగా పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ప్రయాణించడానికి ఇబ్బందికరంగా మారాయి. పెద్ద ఉప్పరపల్లె గ్రామంలో పెద్ద ఉప్పరపల్లె నుండి నంజంపేట వెళ్లే మార్గం పూర్తిగా గుంతలమయం కావడంతో వర్షం కారణంగా గుంతలు నీటితో నిండి రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. అలాగే నంజంపేట నుండి సోమలకు వచ్చే మార్గం కూడా గుంతలమయం కావడం కారణంగా వాహనాల రాకపోకలకు అసౌకర్యంగా ఉంది. రోడ్డుపై ఉన్న గుంతల్లో వర్షంపు నీరు చేరడంతో వాహనదారులు ఎక్కడ గుంత ఉందో తెలీక భయపడుతూ ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. సోమల నుండి నంజంపేట మీదుగా పెద్ద ఉప్పరపల్లికు నూతన తారు రోడ్డు వేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు..: కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దని కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ చెప్పారు. మంగళవారం ఉదయం కమిషనర్ నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. వెంగళరావు కాలనీలో వర్షపు నీరు వీధిల్లో నిలిచిపోతున్నాయన్న ఫిర్యాదుపై పరిశీలించారు. స్థానికంగా మురుగునీటి కాలువలను పరిశీలించి, చేపడుతున్న పారిశుధ్య పనులపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. మురుగునీటి కాలువలకు అవుట్లెట్ లేకపోవడం వల్ల ఇబ్బందులు వస్తున్నాయని గుర్తించారు. కాలువలకు అవుట్లెట్ ఏర్పాటు చేయడానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మురుగునీటి కాలువలను క్రమం తప్పకుండా శుభ్రం చేసి వర్షపు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నగరపాలక పరిధిలో జరుగుతున్న పారిశుధ్య పనులు, గ్యాంగ్ వర్కులపై అధికారులతో సమీక్షించారు. నగరంలోని ప్రధాన రహదారుల వెంట బుష్ కటింగ్ పనులు జరుగుతున్నాయని, నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం గ్యాంగ్ వర్కులు, పారిశుధ్య కార్యక్రమాలు జరుగుతున్నాయని ఎంహెచ్వో డాక్టర్ పి.లోకేష్ వివరించారు.

ఆగని ఏనుగుల దాడులు

ప్రజాశక్తి- రొంపిచర్ల: పులిచెర్ల మండలంలో వరుస ఏనుగు దాడుల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయం చేయాలంటేనే భయపడుతున్న పరిస్థితి. మంగళవారం తెల్లవారుజామున కల్లూరు పంచాయతీ పాలెం గ్రామం, పాతపేట పంచాయితీల్లో ఏనుగుల గుంపు దాడి చేయడం వల్ల రైతులు సయ్యద్ బాషా, రత్నాకర్ నాయుడు, వీరయ్య, రఫీ, సుబ్రహ్మణ్యం, లవ కుమార్‌కు చెందిన వరి పంటలు, అరటి చెట్లు, వేరుశనగ పంటలను తొక్కి నాశనం చేశాయి. ఈ ఏనుగుల దాడుల వల్ల రైతులు భయపడి వ్యవసాయం చేయాలంటేనే ఆలోచనలో పడ్డారు. గత కొన్ని నెలలుగా ఏనుగుల దాడులతో రైతులు పంట పొలాల వైపు వెళ్లాలంటే భయపడుతున్నారు. తెల్లవారుజామున అడవుల్లో నుంచి ఏనుగులు రావడం పంటలను నాశనం చేసుకుంటూ మళ్ళీ అడవుల్లోకి వెళ్లిపోవడం పరిపాటిగా మారిపోయింది.

ఫ్రీ ప్లేస్మెంట్ డ్రైవ్‌లో 58 మంది ఎంపిక

ప్రజాశక్తి -కుప్పం: కుప్పం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం బెంగళూరుకు చెందిన కైనిస్ టెక్నాలజీ వారు నిర్వహించిన ఫ్రీ ప్లేస్మెంట్ డ్రైవ్‌లో 58 మందిని ఎంపిక చేసినట్టు కళాశాల ప్రిన్సిపల్ జగన్నాథరావు తెలిపారు. ఎలక్ట్రానిక్స్ ఎలక్ట్రికల్ మెకానిక్ విద్యార్థులు పాల్గొనగా ఎంపికైన విద్యార్థులకు డిప్లమో కోర్సులు పూర్తయిన తర్వాత ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యోగమూర్తి, రామ క్రిష్ణరావు, కోడార్థి నోటరీ మానిక్యం, ప్రవీణ్ కుమార్, సిబ్బంది పాల్గొ న్నారు.

విద్యార్థిని తలపై కొట్టిన టీచర్

- చిట్లిన బాలిక పుర్రె ఎముక
- రెండు రోజుల పాటు తలనొప్పితో బాధపడ్డ విద్యార్థిని
- ఆసుపత్రికి తీసుకెళ్లగా బయటపడ్డ దారుణం
- టీచర్ పై కేసు నమోదు



ప్రజాశక్తి- పుంగనూరు: తరగతి గదిలో విద్యార్థిని అల్లరి చేస్తోందని ఉపాధ్యాయుడు క్యారీ బ్యాగును బాలిక పైకి విసరడంతో తలకు గాయమై ఆసుపత్రి పాలైంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు పుంగనూరు పట్టణం కొత్త ఇండ్లులో కాపురం ఉంటున్న (లేట్) హరి కుమార్, విజేతల కుమార్తె సాత్విక నాగశ్రీ (11) స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. ఈ నెల 10వ తేదీన తరగతి గదిలో ఆ విద్యార్థి అల్లరి చేస్తోందని బాలిక తలపై హిందీ ఉపాధ్యాయుడు క్యారీ బ్యాగ్‌ను పైకి విసిరాడు. అదే స్కూల్లో బాలిక తల్లి విజేత పనిచేస్తోంది. టీచర్ మాములుగానే కొట్టి ఉంటారనుకుని పెద్దగా పట్టించుకోలేదు. తలనొప్పిగా ఉందని మూడు రోజుల నుంచి నాగశ్రీ పాఠశాలకు వెళ్లలేదు. దీంతో ఆ బాలికను పుంగనూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తల్లి తీసుకెళ్లగా, బెంగళూరు వెళ్లాలని అక్కడి వైద్యులు సూచించారు. బాలికను బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చూపించగా పుర్రె ఎముక చిట్లినట్లు పరీక్షల్లో నిర్ధారణ అయ్యిందని, అది విద్యార్థికి తీవ్ర సమస్యగా మారిందన్నారు. సోమవారం రాత్రి స్కూల్ యాజమాన్యంపై విద్యార్థి తల్లి, బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఉపాధ్యాయులపై 324 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. టీచర్‌ను పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. అయితే పోలీసులు నమోదు చేసిన సెక్షన్ కింద స్టేషన్ బెయిల్ పొందే అవకాశం ఉంది. డాక్టర్ల నివేదిక వచ్చిన తర్వాత 326 (నాన్ బెయిలబుల్) సెక్షన్ కింద కేసు నమోదు అవకాశం ఉన్నట్లు పోలీసు చెబుతున్నారు.

పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి: ఏఐఎస్ఎఫ్

పట్టణంలో ఉన్న భాష్యం పాఠశాలలో విద్యార్థిని తలపుర్రె చిట్లేలా కొట్టిన ఉపాధ్యాయుడిపై, పాఠశాల యాజమాన్యంపై కేసు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. పాఠశాల ఆవరణంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. రాష్ట్ర సమితి సభ్యులు మున్నా మాట్లాడుతూ పుంగనూరులోని భాష్యం పాఠశాలలో 6వ తరగతి స్కూల్ చదువుతున్న సాత్విక(11) అల్లరి చేస్తుందని క్యారీ బ్యాగ్‌తో కొట్టారని, చదువు చెప్పాల్సిన ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రాణాల మీదకు తీసుకురావడం చాలా బాధాకరమన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులను టీచర్లు సరిగా పట్టించుకోవడం లేదని ఫీజులు కట్టడం లేదని, అల్లరి చేస్తున్నారని ఈ విధంగా కొట్టడం సర్వసాధారణమైందని ఆరోపించారు. లక్షల ఫీజులు తీసుకొని చదువు చెప్పకుండా విద్యార్థులను చితకబాది వాళ్ల ప్రాణాల మీదకు తెస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలపైన జిల్లా విద్యాశాఖ యంత్రాంగం వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు ధనుంజయ, ప్రవీణ్, రాజేష్, లోకి, బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేయాలి: డీఆర్వో

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ప్రభుత్వ రంగంలో పనిచేసే ఎన్ఎంఆర్, మజ్దూర్ వర్కర్లకు మార్కెట్ రేట్లకు అనుగుణంగా కనీస వేతనాల పెంపు జరుగుతుందని డిఆర్ఓ కె. మోహన్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని డిఆర్ఓ ఛాంబర్‌లో ఎన్ఎంఆర్, మజ్దూర్ వర్కర్లకు కనీస వేతనాల పెంపుపై జిల్లా కార్మిక శాఖతో కలసి జిల్లాలో అధికారులతో డిఆర్ఓ సమీక్షా సమావేశం నిర్వరహించారు. డిఆర్వో మాట్లాడుతూ 2025–26 సంవత్సరానికి గాను స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్ స్కిల్డ్ కేటగిరీలలో చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్నఎన్ ఎంఆర్, మజ్దూర్ వర్కర్లు అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్, పారిశుధ్య కార్మికులకు కార్మిక కనీస వేతన చట్టం ప్రకారం మార్కెట్ రేటుకు అనుగుణంగా సంవత్సరానికి 5 నుండి 10 శాతం వేతనాల పెంపు ఉంటుందని తెలిపారు. ఇందుకు అనుగుణంగా జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలలో విధులు నిర్వర్తిస్తున్న ఎన్ఎంఆర్, మజ్దూర్ వర్కర్‌లకు వారికి జీతాల పెంపుకు సంబంధించి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధ్యక్షతన నిర్ణయం తీసుకుని కనీస వేతనాల పెంపును ఆమోదించడం జరుగుతుందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో గల నైపుణ్యం లేని, పాక్షిక, సంపూర్ణ నైపుణ్యం గల వర్కర్లుగా విభజించి వేతనాల పెంపుకు ప్రాతిపదికగా తీసుకోవడం జరుగుతుందన్నారు. అందుకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటిలలో పనిచేసే వర్కర్లకు కనీస వేతనం 10శాతం పెంపుకు మున్సిపల్ శాఖ అధికారులు ప్రతిపాదనలు సమర్పించారన్నారు. సహాయ కార్మిక కమిషనర్ ఆలోచన, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ రమణ కుమార్, డ్వామా పీడీ రవి కుమార్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న డిఆర్ఓ

మన లక్ష్యం స్వచ్ఛ కుప్పం: ఎమ్మెల్సీ శ్రీకాంత్

ప్రజాశక్తి -కుప్పం: మన లక్ష్యం.. స్వచ్ఛ కుప్పం అన్న నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం పేర్కొన్నారు. కడ ఆధ్వర్యంలో నిర్వహించిన సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్‌పై రెండు రోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం కుప్పం జమీందారీ బంగ్లా వద్ద నుండి యువత విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ సర్కిల్లో విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్వచ్ఛ కుప్పంపై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా విద్యార్థులతో పాటు ఎమ్మెల్సీ శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, పిఎంకె ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు డాన్సులు వేసి ఉత్సాహపరిచారు. ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, కుప్పం ప్రాంత అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్సీ విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ అధ్యక్షుడు రాజకుమార్, రెస్కో చైర్మన్ ప్రతాప్, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, కౌన్సిలర్లు జిమ్ దాము, సోము, జాకీర్, సురేష్, ఎమ్మార్ సురేష్, రెస్కో డైరెక్టర్ అనసూయ పాల్గొన్నారు.

చెత్తసేకరణలో 20వ వార్డు ఆదర్శం

స్వచ్ఛ కుప్పం కార్యక్రమంలో భాగంగా కుప్పం మున్సిపాలిటీలో 100శాతం డోర్ టు డోర్ చెత్త సేకరణలో 20 వార్డు ఆదర్శంగా నిలిచిందని ప్రశంసాపత్రాన్ని అందజేశారు. కుప్పంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్‌పై రెండు రోజులు పాటు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో భాగంగా 20 వార్డును స్వచ్ఛ వార్డుగా ఎంపిక చేశారు. వార్డు కౌన్సిలర్ సోమును అభినందిస్తూ ఎమ్మెల్సీ శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్ ప్రశంసా పత్రం అందజేశారు. కుప్పం మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించిన మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావును అభినందించారు.

పోరాట ఫలితమే మినీలు మెయిన్ వర్కర్స్ జీవో

విజయోత్సవంలో అంగన్వాడీలు

ప్రజాశక్తి- కార్వేటినగరం: మినీ అంగన్వాడీలను మెయిన్ అంగన్వాడీలుగా చేయాలని 42 రోజులు సమ్మె పోరాట ఫలితంగా ప్రస్తుత ప్రభుత్వం ఆలస్యంగా జీవో ఇవ్వడం జరిగిందని ఏపీ అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు జిల్లా గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు తెలిపారు. మంగళవారం కార్వేటినగరంలో మినీల సమావేశంలో జరిగింది. ఈసందర్భంగా గంగరాజు తోపాటు యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు విజయ, కార్యదర్శి మమతలు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు ఐక్యంగా చేసిన పోరాట ఫలితంగానే మినిల జీవో సాధించడం జరిగిందని, ఇది అందరి విజయమని తెలిపారు. జిల్లాలో కొన్ని ప్రాజెక్టుల్లో అధికారులు డబ్బులు తీసుకుని అర్హులను అనర్హులుగా అనర్హులను అర్హులుగా చేయడం బాధాకరమన్నారు. అలాంటివి క్షుణంగా పరిశీలించి అందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్ర మహాసభలు ఒంగోలులో ఈనెల 20, 21 జరుగుతున్నాయని వాటిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో కూడా అంగన్వాడీల సమస్యలు పరిష్కారం కోసం ఐక్యంగా అందరూ పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రాజెక్టు నాయకులు లక్ష్మీ నరసమ్మ, రెడ్డమ్మ, యువరాణి, భాను, నాగమ్మ, రాణి, విజయ, వల్లెమ్మ పాల్గొన్నారు.

క్వారీని రద్దు చేయాలని డీఆర్వోకి వినతి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : బైరెడ్డిపల్లి మండలం తీర్థం వద్ద వున్న క్వారీ ప్రజలకు అసౌకర్యంగా, ఇబ్బందికరంగా ఉందని నిలుపుదల చేయాలని గ్రామస్తులు మంగళవారం డీఆర్వో మోహన్‌కుమార్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు, గ్రామస్తులు మాట్లాడుతూ గతంలో ఎప్పుడో తీసుకున్న అక్రమ లైసెన్సును ఇప్పుడు ఉపయోగించి క్వారీని ప్రారంభించడంతో గ్రామస్తులకు ఇబ్బందికరంగా ఉందని తెలిపారు. గ్రామానికి అతి సమీపంలో క్వారీ ఉండడంతో భారీ పేలుళ్ల వలన ఇళ్లకు పగులు, పంటపొలాలపై దుమ్ముదూళి పేరుకుపోతోందని, స్కూల్ సైతం క్వారీకి దగ్గరగా ఉందని తెలిపారు. ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా క్వారీలకు పర్మిషన్లు ఇవ్వడం దారుణమన్నారు. కోర్టులు స్పష్టంగా ప్రజలకు అసౌకర్యంగా ఉండే విధంగా చేయకూడదని ఆదేశాలు ఉన్నప్పటికీ పర్మిషన్లు ఇవ్వడం సరికాదన్నారు. దీనిపై తగుచర్యలు తీసుకోవాలని కోరారు.

చిత్తూరు కోర్టుకు హాజరైన టిడిపి నేతలు

ప్రజాశక్తి-కుప్పం: చిత్తూరు జిల్లా కోర్టుకు మంగళవారం కుప్పం టిడిపి నేతలు హాజరయ్యారు. ప్రతిపక్ష నేతగా చంద్రబాబు రామకుప్పం మండలం కొల్లుపల్లిలో పర్యటించినప్పుడు చోటుచేసుకున్న ఘటనలు నేపథ్యంలో టిడిపి నేతలపై పలు కేసులు నమోదు చేశారు. దీనికి సంబంధించి మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, సీఎం చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్, మాజీ ఏఎంసీ చైర్మన్ సత్యేంద్ర శేఖర్, టిడిపి సీనియర్ నేత ఉయ్యాల జయరామిరెడ్డి, మునుస్వామి, మంజు, చెక్కు మొత్తం మణి తదితరులు మంగళవారం చిత్తూరు కోర్టుకు హాజరయ్యారు. అయితే పలువురు టిడిపి నేతలు కోర్టుకు హాజరు కాకపోవడంతో ఈనెల 29న కోర్టు వాయిదా వేసింది. ప్రభుత్వ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నరక వస్తున్న నేటికీ తాము కోర్టుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొందని వైసీపీ హాయంలో పెట్టిన తప్పుడు కేసుల నుంచి తమకు విముక్తి ఎప్పుడు కలుగుతుందోనని టిడిపి నేతలు వాపోతున్నారు.

నేటి నుంచి స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం నుండి ప్రారంభం కానున్న స్వస్థ – నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమానికి మంగళవారం స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ సునీల్ నాయక్, జాయింట్ డైరెక్టర్, జిల్లా స్థాయి అధికారులతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు ఉషశ్రీ, జిల్లా సమన్వయ ఆరోగ్య డాక్టర్ పద్మాంజలి, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్‌తో కలిసి ముందస్తు ప్రణాళికపై సమీక్షించారు. ఈ కార్యక్రమానికి కావలసిన స్పెషలిస్ట్ డాక్టర్లు, వైద్యాధికారులు, సిబ్బంది, లేబరేటరీ పరికరాలు, ఆరోగ్య పరీక్షలకు సంబంధించిన అన్ని పరికరాలను, మందులను సమకూర్చుకోవాలని తెలిపారు. పేషెంట్స్‌కు కల్పించాల్సిన వసతులపై ఎంసిహెచ్ బిల్డింగ్‌ను జాయింట్ డైరెక్టర్, అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంపై గ్రామీణ స్థాయిలో ఆశా, ఏఎన్ఎం, ఎమ్మెల్ హెచ్ పిలు ఇంటింటికి వెళ్లి ముందస్తు క్యాంప్ తేదీలు తెలియజేయాలన్నారు. ముఖ్యంగా మహిళలు ఎక్కువ సంఖ్యలో పాల్గొనేటట్లు అవగాహన కలిగించి అభ ఐడి క్రియేషన్, ఎన్‌సిడి స్క్రీనింగ్, కేన్సర్ స్క్రీనింగ్, పౌష్టికాహార ప్రాముఖ్యత, బ్లడ్ డొనేషన్, రక్త పరీక్షలు, మహిళలకు ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ సంధ్య, నర్సింగ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

నిలకడ లేని నియామకాలు..!

- పరిష్కారం కాని సమస్యలు
- ఇన్‌ఛార్జి పాలనలో ముందుకు కదలని ఫైళ్లు
- ప్రజలు అవస్థలు..స్పందించని అధికారులు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: నిలకడ లేని అధికారుల నియామకాల కారణంగా స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ సచివాలయానికి ఇన్‌ఛార్జి పాలనే దిక్కు.. దీంతో సమస్యలతో వచ్చిన ఫైళ్లు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. ఆ సచివాలయం చుట్టూ ప్రజలు తిరిగి తిరిగి ఆవేదనకు, తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఇందుకు తార్కాణమే మాంబేడు సచివాలయం..

ఇన్‌ఛార్జి పాలనలో నడుస్తున్న మాంబేడు సచివాలయం

నిలకడ లేని నియామకాలు..!

గంగాధర నెల్లూరు నియోజకవర్గ పరిధిలో వెదురుకుప్పం మండలం, మాంబేడు సచివాలయం వుంది. ఈ సచివాలయంలో పది శాఖలు విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నాయి. ఈ సచివాలయంలో కార్యదర్శి, వీఆర్వో కీలకం. ఈ రెండు శాఖల ఇన్‌ఛార్జిలే దిక్కు.. కొమర గుంట సచివాలయం డిడిఓ మాంబేడు సచివాలయానికి ఇన్‌ఛార్జిలుగా వ్యవహరిస్తున్నారు. బ్రాహ్మణపల్లి వీఆర్‌వోగా విధులు నిర్వహిస్తున్న ధనశేఖర్, మాంబేడు ఇన్‌ఛార్జి వీఆర్‌వోగా ఉన్నారు. గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు, ఇతర పనుల కోసం ఆయా సచివాలయాలకు వెళ్లాల్సిందే. ఇన్‌ఛార్జిలు ఉన్నా ఉద్యోగులు ఎప్పుడో ఒక సమయంలో మాంబేడు సచివాలయానికి వచ్చి వెళుతుంటారు. ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళతారో తెలియని పరిస్థితి ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు. చిన్న చిన్న పనుల కోసం వేరే సచివాలయానికి వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు.

పరిష్కారం కాని సమస్యలు

మండలంలోని అతి పెద్ద పంచాయతీలలో ఇది ఒక పంచాయతీ. సమస్యలు ఎక్కువగా వున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. చిన్న చిన్న జనన, మరణ, విద్యార్థులకు కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, అప్లై చేయాలంటే వీఆర్‌వో ఎవరో తెలియని పరిస్థితి.. అక్కడ ఉన్న నెంబరుకి పని చేస్తే ఆ ఫోను నెంబరు పనిచేయదు. ఏమి చేయాలో దిక్కు తోచని పరిస్థితి ఏర్పడింది.

ఖాళీగా దర్శన మిస్తున్న వీఆర్‌వో కుర్చీ

ప్రజలు అవస్థలు..స్పందించని అధికారులు

వివిధ పనుల కోసం మాంబేడు సచివాలయానికి వచ్చిన వారు పరిష్కారం కాకపోవడంతో నిరాశతో వెను తిరుగుతున్నారు. ఎంపీడీవో కార్యాలయం దృష్టికి గ్రామస్తులు పలుమార్లు ఈ సమస్యను తీసుకెళ్లినా ప్రయోజనం లేదని వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఆ గ్రామంలో ఉన్న సచివాలయానికి శాశ్వత అధికారిని నియమించి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు మాంబేడులో మెడికల్ క్యాంప్

డాక్టరు కృష్ణచైతన్య

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని మాంబేడు గ్రామంలో బుధవారం మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు వైద్య అధికారి డాక్టర్ కృష్ణ చైతన్య మంగళవారం తెలిపారు. ఇందులో గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి ఆశా కార్యకర్తల సహాయంతో సర్వే నిర్వహించి, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించడ, జ్వరం ఉన్నవారికి మెడికల్ టెస్ట్ లు నిర్వహించి వారికి మందులు పంపిణీ చేయడం, అవగాహన కల్పించడం, పారిశుద్ధ్యం, ఇంటి ఆవరణలో వాటర్ బాటిల్ లాంటి వ్యర్థాల నిల్వలు లేకుండా చూడడంపై ప్రతి ఇంటిలో ఆశ, ఏఎన్ఎం ఆస్పత్రి సిబ్బందిచే అవగాహన కల్పిస్తారని తెలిపారు. మండలంలో ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన మంచి నీళ్లనే తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి -శాంతిపురం: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ) శాంతిపురంలో 4వ దఫా ప్రవేశాలకు ఆసక్తి గల అభ్యర్థులు ఐటీఐ.ఎపి.జివోవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 27వ తేదీ లోపు ఆన్‌లైనులో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఐ శేషారెడ్డి తెలిపారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులు ఈ నెల 28వ తేదీ లోపు సాయంత్రం 2 గంటల లోపు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలు ప్రభుత్వ ఐటీఐ శాంతిపురం కార్యాలయానికి హాజరై ధృవీకరణ చేయించుకోవాలని సూచించారు. 29-09-2025 ఉదయం 9 గంటలకు ప్రభుత్వ ఐటీఐ శాంతిపురంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా హాజరు కావాలని ప్రిన్సిపాల్ ప్రకటనలో తెలిపారు.

18 నుండి 2 వరకు మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు

వైద్యాధికారి జయసింహ

ప్రజాశక్తి -సోమల: సెప్టెంబర్ 18వ తేదీ నుండి అక్టోబర్ రెండవ తేదీ వరకు మండల కేంద్రమైన సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సబ్ సెంటర్లల్లో స్వస్థ నారి సశక్త్ పరివార్‌లో భాగంగా మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి అనారోగ్య పరిస్థితులను గుర్తించి వైద్యం అందజేయడం జరుగుతుందని ఈ అవకాశాన్ని సబ్ సెంటర్ పరిధిలోని గ్రామాలలో మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి జయసింహ కోరారు. మంగళవారం ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. 18వ తేదీ 81 చిన్న ఉప్పరపల్లి, 19న దిడ్డివారి పల్లి, 20న ఇరికిపెంట, 22న నంజంపేట, 23న పొదలకుంటపల్లి సచివాలయాల వద్ద వైద్య శిబిరాలు నిర్వహిస్తామని 27వ తేదీ సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మెడికల్ క్యాంపు నిర్వహిస్తామని మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ప్రదీప్ కుమార్ రెడ్డి, సిహెచ్‌ఓ అమర్నాథ్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోటాపోటీగా కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-చౌడేపల్లి: చారాల ఉన్నత పాఠశాలలో ఎస్ జి ఎఫ్ ఎల్ క్రీడల్లో భాగంగా మండల స్థాయి కబడ్డీ పోటీలు అండర్ 14- 17 బాల బాలికల పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈ పోటీలకి మండలంలోని ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు 200 మంది పాల్గొన్నారు. ఈ పోటీలకు మండల విద్యాశాఖ అధికారి కేశవ రెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణుక ప్రారంభించారు. ఈ ఆటలు పోటీలలో వివిధ విభాగాలలో వివిధ జట్లు విజేతలుగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ పీడీ రామచంద్ర, మండల కో ఆర్డినేటర్ వెంకటేష్, బసవ మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులు రాజేంద్ర పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెడ్డప్ప ఆకస్మిక మృతి

ప్రజాశక్తి : చౌడేపల్లి: మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రెడ్డప్ప ఆకస్మికంగా మృతి చెందాడు. గత 10 సంవత్సరాలుగా విశ్వబ్రాహ్మణులకు ఆయన అనేక సేవలు చేశారు గత కొన్ని రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ రెడ్డప్ప మృతి చెందారు. ఆయన మృతికి మండలంలోని విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు కార్యకర్తలు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

మంత్రిని కలిసిన ధనంజయ నాయుడు

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: విజయవాడలోని మంత్రి స్వగృహంలో మంగళవారం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను జిల్లా టిడిపి మాజీ తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి ధనంజయ నాయుడు నేతలతో కలిసి మర్యాద పూర్వకంగా శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి తెలుగు యువత అధ్యక్షుడు కిషోర్ నాయుడు, ప్రసాద్ నాయుడు, నవీన్ పాల్గొన్నారు.

సిఎంసి ఆధ్వర్యంలో ఎన్‌పిఎన్‌సిడి ప్రోగ్రాం

ప్రజాశక్తి -ఐరాల: ఐరాల ఆసుపత్రి లో డాక్టర్ రెడ్డప్ప ఆధ్వర్యంలో ఐసిఎంఆర్ టీం సీఎం సి వేలూరు నుండి విచ్చేశారు. ఎన్‌పిఎన్‌సిపి ప్రోగ్రాం లో భాగంగా రక్తపోటు, మధుమేహం, సిఓపిడి, ఆస్తమా, రోగులను కమ్యూనిటీ పరిధిలో ఎలా గుర్తించాలి ఎలా స్క్రీనింగ్ నిర్వహించాలి? ఎలా మేనేజ్మెంట్ చేయాలి? డైటరీ నోటిఫికేషన్, రిఫరల్ సిస్టం,ను ఎలా నిర్వహించాలో ఎంఎల్ హెచ్‌పి లకు శిక్షణను ఇచ్చారు.

ప్రైవేటు పాఠశాల నుండి ప్రభుత్వ పాఠశాలలో చేరిక



ప్రజాశక్తి- తవణంపల్లి: పొన్నేడు పల్లె మోడల్ ప్రైమరీ పాఠశాలలో ప్రైవేటు పాఠశాల నుండి విద్యార్థులను మంగళవారం చేర్చారు. ఈ పరిసర గ్రామాలకు సంబంధించిన జమీర్ కుటుంబం పొన్నెడు పల్లె మోడల్ ప్రైమరీ పాఠశాలలో ప్రభుత్వం చేపట్టిన విద్యా విధానాలకు, విద్యా బోధనకు ఆకర్షితులై వారి పిల్లల ఇర్ఫాన్, సుఫియాన్ లను మొదటి తరగతి, రెండవ తరగతిలో చేర్చారు. వారి నమ్మకం పట్ల వారు తమ పాఠశాలలో చేర్పించినందుకు పాఠశాల సిబ్బంది వారికి ధన్యవాదాలు తెలిపారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ప్రజాశక్తి- ఐరాల: కాణిపాకం స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు మంగళవారం తెప్పోత్సవం సందర్భంగా గణేష్ మాల ధరించిన భక్తులు అధిక సంఖ్యలో ఇరుముడులు సమర్పించారు. సుమారు 60 మంది గణేష్ దీక్ష భక్తులు స్థానికులు, ఉభయదారులు ఆధ్వర్యంలో కల్యాణకట్ట మిద్దెపై ఉన్న మండపం నుంచి ఇరుముళ్ల చెల్లించి మొక్కులు చెల్లించుకున్నారు. ముఖ్య అతిథిగా పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ మోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. అనంతరం భక్తులు ఎమ్మెల్యేను భారీ గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాణిపాకం ఆలయ ఈవో పెంచల కిషోర్, ఆలయ అధికారులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

వి కోట ఎంపీడీవోగా వెంకటేశ్వరరావు

వికోట ఎంపిడివోను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -వి కోట : వీకోట మండల నూతన ఎంపీడీవోగా వెంకటేశ్వర రావు మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లా అల్లూరు మండలం నుండి ఉద్యోగోన్నతి పై ఎంపీడీవోగా వీకోట మండలానికి బదిలీపై వచ్చారు. శాంతిపురం మండల పరిషత్ కార్యాలయంలో ఈవో పీఆర్డిగా విధులు నిర్వహిస్తున్న ఈశ్వర్ డిప్యూటేషన్ పై ఇంతకాలం వీకోట మండల పరిషత్ ఎంపీడీవో గా విధులు నిర్వహిస్తున్నారు. నూతన ఎంపీడీవో బాధ్యతలు చేపట్టడంతో వారు మళ్లీ శాంతిపురం మండల పరిషత్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. వెంకటేశ్వరరావును స్థానిక ఎంపీపీ యువరాజ్ మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది సాధరంగా ఆహ్వానించారు. ప్రభుత్వం నిర్దేశించిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు పారదర్శకంగా అందించేందుకు తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా నూతన ఎంపీడీవో తెలిపారు.

సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి -యాదమరి:

యాదమరి మండలం కృష్ణం పల్లి గ్రామంలో న రా త ్ న ం గా నిర్మించనున్న విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి ఆర్డిఓ శ్రీనివాసులు మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. కృష్ణంపల్లి గ్రామంలో విద్యుత్ శాఖ అధికారుల సమక్షంలో స్థలాన్ని పరిశీలించారు. యాదమరి మండలంలో రైతులులో వోల్టేజ్ సమస్య పరిష్కరించేందుకు ప్రభుత్వం మదనపు సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపింది. సబ్ స్టేషన్ నిర్మాణం కోసం అనువైన స్థలాన్ని పరిశీలించేందుకు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ముని చంద్ర, తహశీల్దారు పార్థసారథి, విద్యుత్ శాఖ ఏఈ గుర్రప్ప సర్వేయర్ తులసిదర్, వీఆర్వోలులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు ఇన్సూరెన్స్ చేసుకోవాలి

ప్రజాశక్తి -యాదమరి: ప్రతి రైతు సహకార సంఘంలో బ్యాంకు ఖాతాలు ప్రారంభించి ఇన్స్యూరెన్స్ చేసుకోవాలని డిసిసిబి బ్యాంక్ మేనేజర్ ఆర్ రఘు బాబు రైతులకు విజ్ఞప్తి చేశారు. సహకార సంఘంలో మంగళవారం ఉదయం గంటలకు డిసిసి బ్యాంకు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ టి ధనంజయ రెడ్డి, డిసిసిబి సూపర్వైజర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతాలను ప్రారంభించుకోవాలని సూచించారు. ప్రతి రైతు కూడా ఇన్సూరెన్స్ చేసుకోవాలని తెలిపారు ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిసిసి బ్యాంక్ గిరింపేట బ్రాంచ్ మేనేజర్ ఆర్ రఘుబాబు మాట్లాడుతూ సహకార సంఘం ద్వారా బ్యాంకు ద్వారా ఇస్తున్న రుణాలు గురించి వివరించారు. వారికి 5 లక్షలు వరకు రుణాలు ఇవ్వవచ్చుని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘ సీఈవో ఆర్ గుణశేఖర్, సిబ్బంది ఖాతాదారులు పాల్గొన్నారు.

గురుకులంలో ఆటలు పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి- రామకుప్పం: స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మండల స్థాయి ఆటల పోటీలను టిడిపి మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి మంగళవారం ప్రారంభించారు. గురుకులం వద్ద ఇరవై ఐదు పాఠశాలలకు చెందిన రెండు వందల మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వాలీబాల్ ,కబడ్డీ, కోకో, క్రికెట్, త్రో బాల్ తదితర క్రీడలు నిర్వహిస్తున్నట్లు, విద్యార్థులు పోటీల్లో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సులోచన గుర్రప్ప, వైస్ ఎంపీపీ వెంకట్రామ గౌడు, రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్, సింగల్ విండో చైర్మన్ మహమ్మద్ రఫీ, జనసేన అధ్యక్షుడు హరీష్, బిజెపి జిల్లా కార్యదర్శి రాజసింహ, మురళి భాస్కర్ ,సుబ్బన్న, ఆనంద్, ఎంఈఓ2 నారాయణ పాల్గొన్నారు.

గాలికుంటు టీకాలతో పశువులకు ఆరోగ్యం

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలతో పశువులలో ఆరోగ్యం పెంపొంది పాల దిగుబడి పెరుగుతుందని తద్వారా పాడి రైతు లాభాల గడిస్తారని తయూరు పశు వైద్యాధికారి డాక్టర్ శ్రీవిద్య అన్నారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం లో భాగంగా మంగళవారం 40 నెలవాయి , దిగువ మేది వాడ చిల మాకులపల్లి గ్రామాల్లో153 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ టీకాలు వేస్తే పశువుల లో పాల దిగుబడి తగ్గుతుందని వదంతులు నమ్మవద్దని రైతులకు సూచించారు. దూడలకు కూడా టీకాలు వేసుకోవాలని దూడల్లో మరణ శాతాన్ని తగ్గించవచ్చని ఆమె తెలిపారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరి చేయిస్తే కఠిన శిక్షలు: జడ్జి

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : వెట్టిచాకిరి చేయిస్తే కఠినమైన శిక్షలు ఉంటాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి అన్నారు. జీవనజ్వాన ప్రతినిధులు మంగళవారం మున్సిపల్ పరిధి కీళపట్టు ఎస్ఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో సుమారు 400 మంది విముక్తి పొందిన కార్మికులతో నిర్వహించిన జీవనజ్వాల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తోటి మనుషులను వెట్టిచాకిరి పనులు చేయించడం క్షమించరాని నేరమని, సాటి మనుషుల పట్ల, పిల్లలతో అసభ్యంగా ప్రవర్తించినా న్యాయ పరంగా కఠిన శిక్షలుంటాయన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ విద్యాపరంగా ఎదిగి సంక్షేమ జీవనాన్ని కొనసాగించాలని, మూఢనమ్మకాలను విడనాడి ధైర్యంగా బతకాలని పిలుపు నిచ్చారు. నగరి ఆర్డీవో అనుపమ మాట్లాడుతూ కట్టు బానిసత్వం నుంచి విడిపించిన కార్మికులకు శాశ్వత జీవనోపాధిని కలిగించాలని, అందుకు ప్రభుత్వం నుండి మద్దతు ఉంటుందన్నారు. నగరి డీఎస్పీ సయ్యద్ మొహమ్మద్ అజీజ్ మాట్లాడుతూ కట్టుబానిసలను విముక్తి కలిగించడంలో పోలీసు శాఖా తరపున ఎటువంటి సహాయం అందించడానికైనా సిద్ధంగా ఉంటామన్నారు. బానిసలుగా పనిచేయించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జీవన జ్వాల సంస్థ ప్రతినిధులు, విద్యారులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రంగనాథ్

ప్రజాశక్తి- వి కోట: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రంగనాథ్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ఓగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మంగళవారం మండలస్థాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల స్కూల్ గేమ్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా విచ్చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. ప్రభుత్వాలు క్రీడలను ప్రోత్సహించేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నాయని ప్రతిభావంతులైన విద్యార్థులు వాటిని అందిపుచ్చుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. మంగళవారం ప్రభుత్వ ప్రైవేటు ఉన్నత పాఠశాలలు చెందిన సీనియర్ జూనియర్ బాలబాలికులకు విడివిడిగా కబడ్డీ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. మాజీ ఏఎంసీ చైర్మన్ రామచంద్ర నాయుడు, చౌడప్ప, రాంబాబు, స్థానిక సర్పంచ్ లలితా శివకుమార్, ఎంఈఓలు చంద్రశేఖర్, మురుగేష్, ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి -రొంపిచర్ల: పులిచెర్ల మండలం మంగళంపేట అంగన్‌వాడీ పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలు చల్లా రామచంద్రారెడ్డి తో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. గ్రేడ్ 2 నుంచి గ్రేడ్ 1 అంగన్‌వాడీలుగా 4700 అంగన్‌వాడీ పాఠశాలలను పునరుద్ధరణ చేసినందుకు, వారి వేతనాలను 7వేల రూపాయల నుంచి 11,500 రూపాయలుగా పెంచినందుకు కృతజ్ఞతగా ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని అన్నారు. స్త్రీ శక్తి పథకంతో మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు లెక్కల ధనుంజయ నాయుడు, టిడిపి నాయకులు కుమార్ రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

కరువు భత్యం, మధ్యంతర భృతి ప్రకటించాలి

చిత్తూరు అర్బన్ : ఏపీటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఆ సంఘం నాయకులు కలెక్టరేట్ వద్ద నిరసన ,ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల సమస్యల పట్ల నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డిఆర్‌ఓకు వినతి పత్రం సమర్పించారు. ఉపాధ్యాయ సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జగదీష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, జిల్లా గౌరవ అధ్యక్షులు ముక్తార్ అహ్మద్ , గౌరవ సలహాదారు గోపీనాథ్ , ఉపాధ్యక్షులు నవీన్ కుమార్ పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్: రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో చిత్తూరు రూరల్ మండలం సికేపల్లి, బంగారెడ్డిపల్లి, నర్సింగరాయనపేట, తాళంబేడు, చెర్లోపల్లి, ఎం అగ్రహారం, దొడ్డిపల్లి తదితర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల సమస్యల సేకరణ, సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌టియు చిత్తూరు జిల్లా శాఖ అధ్యక్షులు మదన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ వెంటనే ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిం చాలని కోరారు.

యాదమరి: రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో చిత్తూరు రూరల్ మండలం సికేపల్లి, బంగారెడ్డిపల్లి, నర్సింగ రాయనపేట, తాళంబేడు, చెర్లోపల్లి, అగ్రహారం, దొడ్డిపల్లి తదితర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల సమస్యల సేకరణ, సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌టియు చిత్తూరు జిల్లా శాఖ అధ్యక్షులు మదన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా కార్యదర్శి రాధా కుమారి సంఘ నాయకులు సుబ్రహ్మణ్యం పిళ్ళై, గుణశేఖరన్ ఉపాధ్యా యులు మురళీధర్ రెడ్డి పాల్గొన్నారు.

దళిత రణభేరిని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి -పెద్దపంజాణి: ఈ నెల 24వ తేదీ విజయవాడలో బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న దళిత రణభేరి జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి శివాడి గోవిందు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలవేసిన అనంతరం దళిత రణభేరి పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీ విజయవాడలో ధర్నా చౌక్ వద్ద నిర్వహిం చనున్న దళిత రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. కేంద్రంలో రాష్ట్రంలో ఏ పార్టీ వచ్చినా దళితుల వారి హక్కులను కాల రాస్తున్నారని, రాజ్యాధికారం ద్వారానే హక్కులు సాధించుకోవచ్చని అంబేద్కర్ ఆనాడే తెలిపారని అందుకోసం అందరు సహకారంతో కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు కృష్ణ, పలమనేరు ఇన్‌ఛార్జి జల్లి అమరనారాయణ, బైరెడ్డిపల్లి మండల అధ్యక్షులు జి శంకరప్ప, దళిత నాయకులు బొమ్మలకుంట రాజన్న, రంగప్ప పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ఫెడరేషన్ అజెండా

ప్రజాశక్తి- పుంగనూరు: జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండాగా ఫెడరేషన్ సంఘం పనిచేస్తుందని ఆ సంఘ రాష్ట్ర నేత కబరకుంట్ల జయరాజ్ అన్నారు. స్థానిక గోకుల్ కళ్యాణ మండపంలో నియోజకవర్గ ఏపీడబ్ల్యూజేఎఫ్ స్థాయి సమావేశం మంగళవారం జరిగింది. జయరాజ్ మాట్లాడుతూ ఏపీడబ్ల్యూజేఎఫ్ క్రమశిక్షణతో కూడిన సంఘమని దీనిలో ప్రతి ఒక్క సభ్యులు సంఘానికి కట్టుబడి ఉండాలన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామన్నారు. గతంలో ఉన్న సంఘ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులకు పదోన్నతి కల్పిస్తూ అన్నమయ్య జిల్లా బాధ్యతలు అప్పగించడం జరిగిందన్నారు. నూతనంగా అధ్యక్ష కార్యదర్శులుగా సైపుల్లా, తల్లా శ్రీనివాసులు ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈసమావేశం ప్రారంభానికి ముందు ఇటీవల మృతిచెందిన జర్నలిస్టులకు శ్రద్ధాంజలి ఘటించారు. పుంగనూరులో 10టీవీ రిపోర్టర్‌గా పని చేస్తూ లోకేష్ అనారోగ్యంతో మృతి చెందాడు. అతను మృతి కూడా తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. జిల్లా సంఘం తరపున కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో జిల్లా సంఘ అధ్యక్ష కార్యదర్శులు ప్రకాష్, షేక్ సలీం, జిల్లా నాయకులు జయచంద్ర, చిన్న, నీరజాక్షల నాయుడు, సీనియర్ జర్నలిస్టులు, సభ్యులందరూ పాల్గొన్నారు.

యూరియా కోసం ఆందోళన చెందొద్దు..

వ్యవసాయ అధికారి దీప

ప్రజాశక్తి- యాదమరి: యూరియా పంటల విస్తీర్ణం, అవసరాన్ని బట్టి సరఫరా అవుతుందని, యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, యూరియాను సరైన విధంగా వినియోగించు కోవాలని రైతులకు వ్యవసాయ అధికారి దీపా సూచించారు. మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా వరదరాజుపల్లి గ్రామంలో రైతులకు పంటలపై చీడపీడల నివారణ మొదలగు వాటిపై అవగాహన కల్పించారు. అలాగే అవసరాన్ని బట్టి ఎరువుల వినియోగం, నానో యూరియా, నానో డిఏపి వాడటం, పశుగ్రాస పంటలలో యూరియా వాడకం, వర్షాకాలం ముందస్తు విత్తనం (రబీ డ్రై సోయింగ్)ను ప్రోత్సహించడం గురించి వివరించారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మండలంలోని మానాగ్రోమ్‌లో యూరియా లభ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రభాకర్‌రెడ్డికి నివాళి

ప్రజాశక్తి -రొంపిచర్ల: పులిచెర్ల మండలం కల్లూరు పంచాయతీ మ తు కు వారిపల్లికి చెందిన రిటైర్డ్ టీచర్ ప్రభాకర్ రెడ్డి మంగళవారం మృతి చెందారు. విషయం తెలు సుకున్న పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి ఆయన మృతదేహానికి నివాళులు అర్పించారు. కుటుం బ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పులిచెర్ల ఎంపిపి సురేంద్ర నాథ్‌రెడ్డి, మండల వైసిపి అధ్యక్షుడు నాధమునిరెడ్డి పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి -రొంపిచర్ల : పులిచెర్ల మండలం మంగళం పేట గ్రామంలో పుంగనూరు టిడిపి ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి మంగళ వారం మెగా వైద్య శిబిరం ప్రారంభించారు. పులిచెర్ల సింగిల్ విండో అధ్యక్షులు లెక్కల ధనుంజయ నాయుడు ఆధ్వర్యంలో ఈ మెగా ఉచిత వైద్య శిబిరాన్ని తిరుపతి రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారు నిర్వహించారు. పులిచెర్ల మండలంలోని గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్న వారికి రక్త పరీక్షలు, స్కానింగులు ఉచితంగా మందులు ఇచ్చారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా తయారీపై సమావేశం

మాట్లాడుతున్న ఆర్‌డివో భవాని

ప్రజాశక్తి- పలమనేరు: భారత ఎన్నికల కమిషన్ వారి ఆదేశాల మేరకు మెరుగైన ఓటర్ల జాబితా తయారీ విషయమై అవగాహన కల్పించేందుకు పలమనేరు ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీ ల ప్రతినిధుల తో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఓటర్ల జాబితా విషయమై వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధుల సమస్యలను ఆర్డిఓ భవాని నివృత్తి చేశారు. మెరుగైన ఓటర్ల జాబితా కోసం అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పలమనేరు ఆర్డీవో భవాని, పలమనేరు మండల తహశీల్దారు ఇన్బనాధన్, మున్సిపల్ మేనేజర్ ఖాదర్ మొహిద్దీన, పలమనేరు నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి -విజయపురం (నగరి): మండలస్థాయి క్రీడా పోటీల్లో భాగంగా మంగళవారం స్థానిక పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, చెస్. యోగా, ఖోఖో పోటీలు నిర్వహించారు. ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయం చెస్ ఆడి ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎంఈవోలు మాట్లాడుతూ క్రీడలు మేధోశక్తిని, స్నేహ భావాన్ని పెంచుతుందన్నారు. ఉన్నత విద్య, ఉద్యోగాలలోను క్రీడలు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. నేడు బాల్ బాడ్మింటన్‌లో నగరి క్రీడాకారులు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం మనకు గర్వకారణమన్నారు. మండల స్థాయిలో విజేతలైనవారు డివిజన్ స్థాయిలో పాల్గొంటారని అక్కడ ప్రతిభ కనబరిస్తే జిల్లా స్థాయికి ఆపై రాష్ట్ర స్థాయిలో పాల్గొనే అవకాశం వస్తుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను ఆసికత చూపారు. సమావేశానంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 320 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మండల క్రీడా కమిటీ కన్వీనర్ మణి, పీడీ సురేష్‌ల నేతృత్వంలో పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్యామలాదేవి , వివిధ పాఠశాలలకు చెందిన పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

ఓజోన్ పొరను రక్షించుకోవాలి

ప్రజాశక్తి -విజయపురం (నగరి): ఓజోన్ పొరను రక్షించు కోవడం అందరి బాధ్యత అని నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వేణుగోపాల్ అన్నారు. మంగళవారం అంతర్జా తీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎకో క్లబ్ ఆధ్వర్యంలో వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. విద్యార్థుల వద్ద కళాశాల ఆవరణలో మొక్కలు నాటించి ఓజోన్ పొర ఆవశ్యకతను తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు. మండలంలోని నెత్తం కండ్రిగ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఓజోన్ పొర ఆవశ్యతను విద్యార్థులు వినూత్నంగా తెలిపారు. ఓజోన్ ఆకారంలోను, ఓ3 ఆకారంలోను కూర్చుని వారు ఓజోన్ పొర ఆవశ్యతను వివరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఉమాశంకర్ మాట్లాడుతూ ఓజోన్‌పొర సూర్యునికి, వాతావరణానికి మధ్య రక్షణగా ఉంటూ అతినీలలోహిత కిరణాలు భూమిపైకి రాకుండా కాపాడుతుందని వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థుల వినూత్న ప్రదర్శన

పెద్దపంజాణి: ప్రకృతికి విరుద్ధంగా మానవుడు స్వార్థ ప్రయోజనాల కోసం పర్యావరణాన్ని పాడు చేస్తున్నారని జీవ శాస్త్రం ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం అప్పినపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మానవులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రకృతికి భంగం కలిగించడంతో, ఓజోన్ పొర దెబ్బతింటోందని, తద్వారా అతివృష్టి, అనావృష్టి, లాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయని, దీన్ని అరికట్టడానికి ఓజోన్ పొరను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుభాషిని,ఉపాధ్యాయులు శంకర్, ప్రసాద్, హరికృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ రాజంపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్(సీనియర్ డివిజన్) వారి కోర్టులో
I.A.No. 594 /2024 In I.A.No. 37/2019
In O.S.No. 34/2013

బుధరపు హేమాన్వి మైనర్ అయినందువలన వారి గార్డియన్, తల్లి బుధరపు ప్రశాంత, భర్త ప్రశాంత్, డోర్ నెంబర్: 13/142/91-A, సంజయ్‌నగర్, మల్కాజ్గిరి, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం. ...పిటిషనర్/వాది

Vs

R4. బుధరపు సరోజ భర్త లేట్ తులసీరామయ్య, కేరాఫ్ సుదర్శన్ మూర్తి, లాయర్స్ కాలనీ, సాయిబాబా గుడి పక్కన, ఆర్టీసీ బస్టాండ్ దగ్గర, చిత్తూర్ టౌన్ అండ్ జిల్లా.
R5. బుధరపు సుభాషిని తండ్రి తులసిరామయ్య భర్త సుదర్శనమూర్తి, లాయర్స్ కాలనీ, సాయిబాబా గుడి పక్కన, ఆర్టీసీ బస్టాండ్ దగ్గర, చిత్తూర్ టౌన్ అండ్ జిల్లా.
R6. బుదరపు సుజాత, తండ్రి లేట్ తులసిరామయ్య భర్త వెంకటేశ్వర్లు,లాయర్స్ కాలనీ, సాయిబాబా గుడి పక్కన, ఆర్టీసీ బస్టాండ్ దగ్గర, చిత్తూర్ టౌన్ అండ్ జిల్లా.
...రెస్పాండెంట్స్/ప్రతివాది No.4 నుండి 6

పిటిషనర్, రెస్పాండెంట్స్ అయిన మీపై భాగపరిష్కార నిమిత్తమై దావా దాఖలు చేసి మరియు పై పిటిషన్ నందు ప్రిలిమినరీ డిక్రీలో తప్పులు సరిచేయమని కోరుతూ గౌరవ రాజశ్రీ వారి కోర్టులో పిటిషన్ దాఖలు చేయడం జరిగినది. కావున పై పిటిషన్ లో మీకు ఏమైనా ఆక్షేపణలు యెడల మీరు కానీ, మీ వకీల్ గారి ద్వారా గాని 24.9.2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు పైకోర్టు నందు హాజరై మనవి చేసుకోవలెను. లేనంతట మీ పరోక్షమునందు తీర్మానించబడునని తెలపడమైనది.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్ట్//
పి. వల్లభ రావు
పిటిషనర్ పరం వకీలు
రాజంపేట.